RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | మంగళవారం, ఏప్రిల్ 21, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 16 | పేజీలు: 8 | వెల : రూ.1




అమెరికాలో వీసా మోసం కేసు..
ఇద్దరు తెలుగువారికి జైలు



## కాంగ్రెస్ దోపిడీతో

# ప్రజల్లో అసంతృప్తి

తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం ప్రారంభిస్తున్నా

కట్టిన ఇల్లు ఇచ్చామంటే నేను చావాలా?

పనిచేయని వారిని ప్రజలే ప్రశ్నించాలి

సభ పెడితేనే రైతుబంధు కిస్తీ ఇస్తారా?

మొదటి సంతకంతోనే హైడ్రా రద్దు చేస్తాం

**తెలంగాణ పునర్నిర్మాణం పునఃప్రారంభం కావాలి. తెలంగాణ దరిద్రం పోయేదాకా.. అన్ని వర్గాల ప్రజలు ఇది మా తెలంగాణ.. గర్వంగా , సంతోషంగా, తలెత్తుకొని బతుకుతం అనే దాకా మనం సేవ చేయాల్సిందే. జగిత్యాల యుద్ధం మీవంతు! తెలంగాణ యుద్ధం మావంతు! జగిత్యాల నుంచే జైత్రయాత్ర.. - కేసీఆర్**

జగిత్యాల: జగిత్యాలలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ రాజకీయంగా విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ఈ సభ వేదికగా బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దాదాపు ఏడాది తర్వాత ప్రజల మధ్యకు వచ్చిన కేసీఆర్ ఈ సభలో విస్తృతంగా ప్రసంగిస్తూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడానికి ఎంత కష్టం పడ్డామో ప్రజలకు తెలుసని కేసీఆర్ అన్నారు. ఆ రాష్ట్రాన్ని అప్పగించిన తర్వాత కూడా ప్రజల అభివృద్ధి కోసం తాను కృషి చేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, ప్రజల ఆశీర్వాదం ఉంటే చివరి వరకు పోరాటం కొనసాగిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మళ్లీ ఒక పునర్నిర్మాణ యజ్ఞాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై కేసీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు తగిన ఫలితాలు అందడం లేదని, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు కావడం లేదని, రైతుబంధు కిస్తీలు కూడా ఆలస్యంగా వస్తున్నాయని వ్యాఖ్యానించారు. సభలు నిర్వహించిన తర్వాతే చెల్లింపులు జరుగుతున్నాయనే పరిస్థితి ఉందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో

(మిగతా 2వ పేజీలో)

# 2029లో తేల్చుకుందాం

కేసీఆర్‌కు రేవంత్ సవాల్

ప్రతిపక్ష హోదా కూడా ఉండనీయనని ఘాటు వ్యాఖ్యలు

2034 వరకు కాంగ్రెస్‌దే అధికారమంటూ ధీమా

నస్తూరుపల్లి సభలో సీఎం రేవంత్ ప్రసంగం

రెండో విడత రైతు భరోసా నిధుల విడుదల




వరంగల్: 'కేసీఆర్ కాస్కో. 2029 ఎన్నికల్లో నువ్వో నేనో తేల్చుకుందాం. నీకున్న ఈ ప్రతిపక్ష హోదా కూడా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుంది' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో సవాల్ విసిరారు. ప్రజాపాలనను అడ్డుకుని పాత విధానాలను తిరిగి తెచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి రాజకీయాలకు ప్రజలే గట్టి సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన సీఎం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలించి, కాటారం మండలం నస్తూరుపల్లిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండో విడత రైతు భరోసా నిధులు రూ.5,700 కోట్లు విడుదల చేసిన తర్వాత ప్రసంగించారు. సభ ప్రారంభంలోనే 'జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేసిన ఆయన, ప్రత్యర్థులపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రజలకు మేలు చేసే పాలన కొనసాగాలా, లేక పాత పాలన మళ్లీ రావాలా అన్నది ప్రజలే నిర్ణయించుకోవాలని సీఎం అన్నారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం

(మిగతా 2వ పేజీలో)

**కేసీఆర్ కాస్కో.. 2029 ఎన్నికల్లో నువ్వో నేనో తేల్చుకుందాం! నీకున్న ఆ ప్రతిపక్ష హోదా కూడా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీదే అధికారం. ఒకవైపు రైతుల కోసం రూ.5,700 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మారుస్తున్న మా 'ప్రజాపాలన' కావాలా.. లేక పాత పాలకుల 'పాపాల పాలన' కావాలా అనేది ప్రజలే నిర్ణయించుకుంటారు. అభివృద్ధికి అడ్డుపడే కుట్ర రాజకీయాలకు ఇక తెలంగాణలో స్థానం లేదు. - సీఎం రేవంత్**

## ఏపీలో 225, తెలంగాణలో 153



ఏపీ, తెలంగాణలో ప్రత్యేక నియోజకవర్గాల పునర్విభజనపై ఈసీ పరిశీలన

ఆర్టికల్ 170 సవరణ అవసరమని గతంలో స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

జాతీయ డీలిమిటేషన్ బిల్లు రాకపోతేనే ప్రత్యేక పునర్విభజనకు అవకాశం

2026 జనాభా లెక్కల తర్వాతే పెంపు ఉంటుందని గతంలో కేంద్రం వెల్లడి




## తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్..

అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్!

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్

చర్చలకు ప్రభుత్వం నుంచి స్పందన కరవు

సమ్మెకు జేఏసీతో పాటు ఇతర కార్మిక సంఘాల పూర్తి మద్దతు

ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించిన ప్రభుత్వం

## ఇండియా--కొరియా

# బలమైన బంధం

### 2030 లక్ష్యం 50 బిలియన్ డాలర్లు

వాణిజ్యాన్ని రెట్టింపు చేసే దిశగా కీలక నిర్ణయం

ఏడాదిలోగా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ఉన్నతీకరణకు అడుగులు

ప్రధాని మోదీ--అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ భేటీలో వ్యూహాత్మక నిర్ణయాలు

ఇంధనం, రక్షణ, సెమీకండక్టర్లు సహా కీలక రంగాల్లో 15 ఒప్పందాలు

భారత్‌లో కొరియన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌కు గ్రీన్‌సిగ్నల్

ఇండో-పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వానికి ఉమ్మడి కట్టుబాటు



న్యూఢిల్లీ: భారత్–దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడే దిశగా కీలక అడుగులు పడ్డాయి. వార్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత స్థాయి నుంచి గణనీయంగా పెంచి 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని ఇరుదేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అంతేకాకుండా 2010లో అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ఏడాదిలోగా ఉన్నతీకరించే దిశగా చర్చలను వేగవంతం చేయాలని నిర్ణయించాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన భేటీలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఈ మేరకు నిర్ణయాలకు వచ్చారు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు విస్తృత చర్చలు జరిగాయి. ముఖ్యంగా ఇంధనం, రక్షణ, అరుదైన ఖనిజాలు,


(మిగతా 2వ పేజీలో)

## పెద్దపల్లి జిల్లాలో దారుణం...
## చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు

సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో దుర్ఘటన

ఇంటి ముందు ఆడుకుంటుండగా మూడేళ్ల బాలికపై దాడి

పొలాల్లోకి లాక్కెళ్లి పీక్కుతిన్న కుక్కలు



అమెరికాలో వీసా మోసం కేసు..

# ఇద్దరు తెలుగువారికి జైలు

నేరాన్ని అంగీకరించిన ఇద్దరు నిందితులు

గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్షకు అవకాశం

రూ.2 కోట్లకు పైగా జరిమానా విధించే ఛాన్స్

నకిలీ ఉద్యోగ పత్రాలతో వీసాల దందా బట్టబయలు

యూనివర్సిటీ పేరుతో భారీ మోసం వెలుగులోకి

కాలిఫోర్నియా: అమెరికాలో హెచ్–1బీ వీసాల మోసం కేసు మరోసారి కలకలం రేపింది. విదేశాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులపై ఇప్పటికే కఠిన ఆంక్షలు అమల్లో ఉండగా, వీసాల దుర్వినియోగం కొనసాగుతున్నట్లు తాజా ఘటన స్పష్టం చేసింది. ఈ కేసులో ఇద్దరు తెలుగు వ్యక్తులు

(మిగతా 2వ పేజీలో)



వాయిస్ ఆఫ్ ప్రజలు

మంగళవారం, ఏప్రిల్ 21, 2026

# ఏపీలో 225, తెలంగాణలో 153




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రత్యేకంగా ఈ రెండు రాష్ట్రాల్లోనే సీట్లు పెంచే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో విభజన హామీ అయిన సీట్ల పెంపుపై తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం, ఏపీలో అసెంబ్లీ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. అయితే, 2026 తర్వాత జరిగే తొలి జనాభా గణన అనంతరమే దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది. దీనికితోడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170కి అనుగుణంగా విభజన చట్టంలోని సెక్షన్ 26ను సవరించకుండా సీట్ల పెంపు సాధ్యం కాదని సుప్రీం కోర్టు కూడా గతంలో ఓ తీర్పులో పేర్కొంది. ఈ రాజ్యాంగపరమైన చిక్కుముడి వల్లే ఇన్నాళ్లు ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ కోసం కేంద్రం ఓ కొత్త బిల్లును తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలల్లో ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తెస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ ఆ జాతీయ బిల్లు రావడం ఆలస్యమైతే, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారమే తెలుగు రాష్ట్రాల్లో సీట్లు పెంచేందుకు ఉన్న అవకాశాలను ఈసీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్..

**అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్!**

**ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్**

**చర్చలకు ప్రభుత్వం నుంచి స్పందన కరవు**

**సమ్మెకు జేఏసీతో పాటు ఇతర కార్మిక సంఘాల పూర్తి మద్దతు**

**ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించిన ప్రభుత్వం**




తెలంగాణలో ఆర్టీసీ సమ్మెకు సర్వం సిద్ధమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభం కానుంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ప్రభుత్వం నుంచి చర్చలకు అధికారిక ఆహ్వానం, డిమాండ్లపై స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెకే మొగ్గు చూపుతున్నట్లు ఆర్టీసీ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ప్రకటించింది. జేఏసీతో పాటు ఇతర కార్మిక సంఘాలు సైతం సమ్మెకు మద్దతు ఇవ్వడంతో ఆర్టీసీలోని దాదాపు అన్ని యూనియన్లు ఇందులో పాలుపంచుకోనున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం తన నివాసంలో ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమ్మె మరో సకల జనుల సమ్మెగా మారుతుందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. "ప్రైవేటు సిబ్బందితో బస్సులు నడపాలని చూస్తే ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు. సమ్మెను విజయవంతం చేసి సమస్యలను పరిష్కరించుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నంలోగా ప్రభుత్వం స్పందించకపోతే తాము కూడా సమ్మెలో పాల్గొంటామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి తెలిపారు.

# ఇండియా-కొరియా బలమైన బంధం



నౌకా నిర్మాణం, సెమీకండక్టర్ల రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 15 కీలక ఒప్పందాలపై సంతకాలు జరగడం ఈ భేటీ ప్రత్యేకతగా నిలిచింది. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా భారత్‌లో కొరియన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది. ఇది తయారీ రంగంలో పెట్టుబడులు పెరగడానికి, ఉపాధి అవకాశాలు విస్తరించడానికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు. నౌకా నిర్మాణం, సముద్ర రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక విధానాన్ని కూడా ఇరుదేశాలు విడుదల చేశాయి. అదేవిధంగా ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, ఆర్కిటిక్ సహకారం వంటి కీలక అంశాలపై సంయుక్త ప్రకటనలు వెలువడ్డాయి. ద్వైపాక్షిక చర్చల కోసం 'ఎకనామిక్ సెక్యూరిటీ డైలాగ్'తో పాటు విదేశాంగ మంత్రిత్వ శాఖల మధ్య కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను ప్రారంభించడం ద్వారా వ్యూహాత్మక సమన్వయానికి కొత్త దారులు తెరుచుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని భారత్, దక్షిణ కొరియా స్పష్టం చేశాయి. ఈ ప్రాంతంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై కూడా మోదీ, లీ జే మ్యూంగ్ చర్చించారు. భారత్--దక్షిణ కొరియా మధ్య ప్రస్తుతం వార్షిక వాణిజ్యం సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉందని ప్రధాని మోదీ తెలిపారు. దీన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలు కీలకమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, చట్టబద్ధ పాలనపై గౌరవం వంటి అంశాలు రెండు దేశాల బంధానికి బలమైన పునాదులని ఆయన ఉద్ఘాటించారు.

## హైదరాబాద్‌లో

## విచిత్రం.. దశదిన కర్మ కోసం కాకి కొనుగోలు

**పురానాపూల్ శ్మశానవాటికలో విచిత్ర ఘటన**

**పిండం ముట్టడానికి రాని కాకులు**

**గంటల తరబడి నిరీక్షించిన కుటుంబ సభ్యులు**

**చివరికి కాకిని కొనుగోలు చేసి ఆచారం పూర్తి**



హైదరాబాద్: హైదరాబాద్‌లోని పురానాపూల్ శ్మశానవాటికలో ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. దశదిన కర్మ సందర్భంగా పెట్టిన పిండాన్ని ముట్టడానికి కాకులు రాకపోవడంతో, ఓ కుటుంబం ఏకంగా ఒక కాకిని కొనుగోలు చేసి తమ ఆచారాన్ని పూర్తి చేసుకోవాల్సి వచ్చింది. తీవ్రమైన ఎండల ప్రభావం సంప్రదాయ కార్యక్రమాలపై కూడా ఎలా పడుతోందో ఈ ఘటన అద్దం పడుతోంది. ఇటీవల ఓ కుటుంబం పురానాపూల్ శ్మశానవాటికలో పెద్ద కర్మ కార్యక్రమం నిర్వహించింది. ఆచారం ప్రకారం పిండ ప్రదానం చేసి కాకుల కోసం గంటల తరబడి ఎదురుచూశారు. అయితే, తీవ్రమైన ఎండల కారణంగా ఆ ప్రాంతంలో ఒక్క కాకి కూడా కనిపించలేదు. సమయం గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చివరికి, వారు ఓ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. సమీపంలోని ముర్గి చౌక్‌కు వెళ్లి, అక్కడ ఓ కాకిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. ఆ కాకితో పిండం ముట్టించి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ ఘటన వేసవి తాపం కేవలం మనుషులనే కాకుండా పక్షులు, ఇతర జీవజాలాన్ని కూడా ఎంతలా ఇబ్బంది పెడుతోందో తెలియజేస్తోంది. హిందూ సంప్రదాయంలో పితృకార్యాల సమయంలో కాకికి పిండం పెట్టడం చాలా ముఖ్యమైంది. కాకిని పితృదేవతల రూపంగా భావిస్తారు. కాకి పిండాన్ని స్వీకరిస్తే, పితృదేవతల ఆత్మ శాంతించినట్లు, వారు సంతృప్తిగా ఉన్నట్లు నమ్ముతారు. అయితే, పిండాన్ని బలవంతంగా కాకితో ముట్టించడం శాస్త్రసమ్మతం కాదని, అది సహజంగా జరగాల్సిన ప్రక్రియ అని పండితులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిండాన్ని ఆవుకు తినిపించడం లేదా నదిలో కలపడం వంటి ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని వారు సూచిస్తున్నారు.




## అమెరికాలో వీసా మోసం కేసు..

## ఇద్దరు తెలుగువారికి జైలు

తమ నేరాన్ని అంగీకరించడంతో విషయం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. కాలిఫోర్నియాలోని డబ్లిన్ నగరానికి చెందిన సంపత్ రాజీదీ, శ్రీధర్ మాడ ఈ మోసంలో కీలక పాత్ర పోషించినట్లు అమెరికా అటార్నీ కార్యాలయం వెల్లడించింది. విచారణలో నిందితులు తమ తప్పును అంగీకరించడంతో అమెరికా చట్టాల ప్రకారం వీరికి గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్షతో పాటు సుమారు 2.5 లక్షల డాలర్ల (దాదాపు రూ.2 కోట్లు) జరిమానా విధించే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారం హెచ్-1బీ వీసా వ్యవస్థలో ఉన్న లోపాలను మరోసారి బయటపెట్టింది. సంపత్ రాజీదీ అమెరికాలో రెండు వీసా ప్రాసెసింగ్ కంపెనీలను నిర్వహిస్తూ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఉద్యోగాలు ఉన్నట్లు నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించి విదేశీయులకు వీసాల కోసం దరఖాస్తులు చేసేవారని వెల్లడైంది. ఈ నకిలీ పత్రాల ఆధారంగా అనేక మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఉన్నట్లు చూపించి వీసాలు పొందేలా ప్రయత్నించారు. ఇక శ్రీధర్ మాడ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో అగ్రికల్చర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ విభాగంలో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలింది. అభ్యర్థులు యూనివర్సిటీ ప్రాజెక్టుల్లో పని చేస్తారని చూపిస్తూ ఫేక్ డాక్యుమెంట్లు అందించారని విచారణలో వెల్లడైంది. సాధారణంగా హెచ్-1బీ వీసా పొందాలంటే అమెరికాలోని సంస్థలో ఉద్యోగం తప్పనిసరి. అయితే ఈ నిబంధనను ఆసరాగా చేసుకుని నిందితులు నకిలీ ఉద్యోగాల పేరుతో వీసా ప్రక్రియను మోసపూరితంగా ఉపయోగించుకున్నారని అధికారులు తెలిపారు. 2020 జూన్ నుంచి 2023 జనవరి వరకు ఈ దందా కొనసాగినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనతో హెచ్-1బీ వీసాల జారీపై అమెరికా మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశముంది. విదేశీయుల ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపే ఈ తరహా మోసాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమవుతోంది.

## కాంగ్రెస్ దోపిడీతో ప్రజల్లో అసంతృప్తి

అమలు చేసిన పథకాలను ప్రస్తావిస్తూ కేసీఆర్ తన ప్రభుత్వాన్ని సమర్థించుకున్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సమస్యను పరిష్కరించామని, విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచి ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. హైడ్రా చర్యలపై కూడా కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని, ఇది సరైన విధానం కాదని అన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే మొదటి సంతకంతోనే హైడ్రాను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలపై ఒత్తిడి పెంచే విధానాలను సహించబోమని తెలిపారు. జీవన్‌రెడ్డి చేరికను కేసీఆర్ కీలకంగా అభివర్ణించారు. దాదాపు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు పార్టీకి చేరడం బలం పెంచుతుందని చెప్పారు. ఆయనను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటిస్తూ, జగిత్యాల నుంచి ఇతర జిల్లాల వరకు బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఇద్దరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో మార్పు అవసరమని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజలు సంఘటితమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే నమ్మకం వ్యక్తం చేస్తూ, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. జగిత్యాల సభతో రాజకీయ శక్తులను ఒకేచోట చేర్చి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# 2029లో తేల్చుకుందాం

తమ విధానమని స్పష్టం చేశారు. గతంలో నిర్మించిన ప్రధాన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించిన చరిత్ర కాంగ్రెస్‌కే చెందిందని పేర్కొన్నారు. రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, రుణమాఫీ, మద్దతు ధరల వంటి చర్యల ద్వారా రైతులను ఆదుకుంటున్నామని చెప్పారు. గతంలో రైతులు ఆత్మహత్యలకు గురైన పరిస్థితిని మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే దిశగా ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణలో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టులను పునరుద్ధరిస్తూ, రైతులకు సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజాపాలన కొనసాగాలా లేదా పాత పాలనకు అవకాశం ఇవ్వాలా అన్నది ప్రజలే ఆలోచించాలని కోరారు. జీవన్‌రెడ్డి అంశాన్ని ప్రస్తావిస్తూ సీఎం విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాలను మరిచి పార్టీ మారడం సరికాదని అన్నారు. గతంలో ఎన్నోసార్లు అవకాశం ఇచ్చినా, పార్టీకి విధేయత చూపలేదని విమర్శించారు. రాజకీయ నైతికతను పక్కనబెట్టి వ్యవహరించడం సరికాదని అన్నారు. కుట్ర రాజకీయాలకు రాష్ట్రంలో స్థానం లేదని సీఎం స్పష్టం చేశారు. వైఎస్సార్-డీఎస్ కాంబినేషన్ మాదిరిగా తాను, మహేశ్‌కుమార్ గౌడ్ కలిసి పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రజాపాలన కొనసాగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరైనా అడ్డొచ్చినా వెనుకడుగు వేయబోమని సీఎం హెచ్చరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడం, ప్రాజెక్టులను పూర్తి చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి జిల్లాలో దారుణం...

## చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు

పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. దివ్యా బెహ్రా అనే బాలిక తమ ఇంటి ముందు వీధిలో ఆడుకుంటోంది. ఈ సమయంలో బాలికపై కుక్కలు దాడి చేశాయి. కుక్కలు బాలికను నోట కరుచుకుని పొలాల్లోకి తీసుకువెళ్లాయి. ఈ క్రమంలో కుక్కలు పీక్కుతినడంతో తీవ్రగాయాలతో చిన్నారి మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రులు ఒడిశా నుంచి వచ్చి ఇటుకబట్టీల్లో పని చేస్తున్నారు. తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ హృదయ విదారకమైన ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

## శాంతి చర్చలకు అమెరికా చర్యలే అడ్డంకి: ఇరాన్

**తమ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ విదేశాంగ మంత్రి ఆగ్రహం**

**తదుపరి విడత చర్చల్లో పాల్గొనడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని వెల్లడి**

**అమెరికా ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఇరాన్ విమర్శ**

**పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య తొలి విడత చర్చలు**



అమెరికా చేపడుతున్న రెచ్చగొట్టే చర్యలు, కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు ఇరు దేశాల మధ్య శాంతి చర్చల కొనసాగింపునకు పెను ఆటంకంగా మారాయని ఇరాన్ తీవ్రంగా హెచ్చరించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోకపోతే చర్చల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి ఈ మేరకు పాకిస్థాన్, రష్యా విదేశాంగ మంత్రులతో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్‌కు చెందిన 'టౌస్కా' అనే కంటైనర్ నౌకను, దాని సిబ్బందిని అమెరికా అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వాషింగ్టన్ నుంచి వైరుధ్యపూరిత ప్రకటనలు, బెదిరింపులు వస్తున్నాయని ఆరోపించారు. 40 రోజుల భీకర పోరు తర్వాత ఏప్రిల్ 8న ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఏప్రిల్ 11, 12 తేదీల్లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు జరిగాయి. అయితే, అమెరికా తీరు కారణంగా తదుపరి విడత చర్చల్లో పాల్గొనడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బకాయి తెలిపారు. అమెరికా ఒకవైపు దౌత్యం అంటున్నప్పటికీ, మరోవైపు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీతో పాటు పలువురు సీనియర్ కమాండర్లు, పౌరులు మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్.. ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసిన విషయం తెలిసిందే.



## గీతంలో ఎన్.సీ.సీ.పై అవగాహన

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని క్రీడలు, ఎన్.సీ.సీ. డైరెక్టరేట్ ఆధ్వర్యంలో, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్.సీ.సీ) క్యాడెట్లకు సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్.సీ.సీ.లోని పరిధి, శిక్షణ, అవకాశాల గురించి ఈ కార్యక్రమంలో పరిచయం చేశారు. ఈ సమావేశంలో, వార్షిక శిక్షణా శిబిరం (ఏటీసీ), గణతంత్ర దినోత్సవ శిబిరం (ఆర్డీసీ) తల్ సైనిక్ శిబిరం (టీఎస్సీ) ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్బీ) శిబిరంతో సహా వివిధ శిబిరాల ప్రాముఖ్యతను ఎన్.సీ.సీ. అధికారి, సీనియర్ క్యాడెట్లు వివరించారు. ప్రజెంటేషన్లు, వీడియోల ద్వారా, క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్, దిక్సూచి వినియోగం, దూరాన్ని అంచనా వేయడం, క్షేత్ర సంకేతాలు, నిర్ధారిత సమయంలో టెంట్లు వేయడం, డ్రిల్, శారీరక శిక్షణ, ఆయుధ నిర్వహణ, సాంస్కృతిక మార్పిడి, జాతీయ స్థాయి పోటీలు వంటి కార్యకలాపాలను పరిచయం చేశారు. క్రమశిక్షణ, నాయకత్వం, జట్టు స్ఫూర్తి, జాతీయ భావనను పెంపొందించడంలో ఈ శిబిరాల పాత్రను ఈ సందర్భంగా ప్రముఖంగా తెలియజేశారు.

ఎన్.సీ.సీ. శిక్షణ కేవలం సాధారణ డ్రిల్స్ కు మాత్రమే పరిమితం కాదని, బాధ్యతాయుతమైన, ఆత్మవిశ్వాసం గల పౌరులుగా తీర్చిదిద్దే పరివర్తనాత్మక అనుభవాలను అందిస్తుందని ఈ కార్యక్రమం ప్రస్ఫుటీకరించింది. అసోసియేట్ ఎన్.సీ.సీ. అధికారి లెఫ్టినెంట్ ఎస్.అజయ్ కుమార్ సీనియర్ క్యాడెట్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## అంబేడ్కర్ ఆశయాలకు అంకితభావం

**- రాజగృహ, చైత్యభూమిలో కర్కనాగరాజు కుటుంబం ఘన నివాళి**



కూకట్‌పల్లి, ఏప్రిల్ 20(వాయిస్ టుడే): ప్రపంచ పీడిత ప్రజలకు దారిదీపంగా నిలిచిన మహామానవుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి స్ఫూర్తి కేంద్రాలైన ముంబైలోని రాజగృహ మరియు చైత్యభూమిలను తెలంగాణ అంబేద్కరైట్ కుటుంబం ఘనంగా సందర్శించింది. సోమవారం ముంబైలోని దాదర్ ప్రాంతంలో ఉన్న ఈ చారిత్రాత్మక ప్రదేశాలకు హైదరాబాద్ నుంచి విచ్చేసిన ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, ప్రముఖ కార్మిక నాయకులు కర్కనాగరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి చేరుకుని బాబాసాహెబ్‌కు భక్తిశ్రద్ధలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కర్కనాగరాజు మాట్లాడుతూ "రాజగృహ, చైత్యభూమి వంటి బహుజన చారిత్రాత్మక ప్రదేశాలు మా ఉద్యమానికి అపారమైన బలం ఇస్తాయి. బాబాసాహెబ్ ఆలోచనలు మా జీవితాలకు మార్గదర్శకం. ఆయన ఆశయాల సాధన కోసం మరింత శ్రమించేందుకు ఇక్కడే ప్రతిజ్ఞ చేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో స్వాగతం పలికిన ముంబై నాయకులు, స్థానిక ఎం.టి.బి.ఎఫ్ నాయకులు, గాయకులు భీంరత్న మాలజీ, బొమ్మ రాములు మహరాజ్, జర్నలిస్ట్ గుర్రం నరేష్ మహరాజ్, రమేష్ చౌవల్, మూలనివాసి మాలజీ, కర్కప్రేమ్, బొమ్మ అనిల్ కుమార్ మహరాజ్ కర్కనాగరాజు కుటుంబాన్ని ఆత్మీయంగా ఆహ్వానించారు. బుద్ధుని పంచశీల ఖండువలతో సత్కరించి అతిథులైన తెలంగాణ కుటుంబానికి బుద్ధుడి పంచశీల ఖండువలు కప్పి, ముంబై మహానగరానికి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, సమానత్వం, సోదరభావాన్ని ప్రతిబింబిస్తూ ప్రత్యేకంగా నిలిచిందని, అంబేడ్కర్ ఆశయాలను హృదయంలో పెట్టుకున్న ఈ సందర్శన కేవలం యాత్ర మాత్రమే కాకుండా, బహుజన ఉద్యమానికి మరింత శక్తినిచ్చే సంకల్ప యాత్రగా నిలిచింది.



## ఎం.ఎన్.రెడ్డి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 20(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ డివిజన్లోని ఎమ్.ఎన్.రెడ్డి నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి రిజిస్ట్రేషన్లు మరియు వారి స్థలాలను ప్రొహిబిటెడ్ జాబితా ( నిషేధిత జాబితా) చేర్చడం చేత సుమారు 150 కుటుంబాలు ఇబ్బంది పడుతున్న ఈ సమస్యను శ్రీశైలం గౌడ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు వారి సమస్య పూర్తిగా విన్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి వారి ఇంటి స్థలాలు ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చిన స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ ఆ జాబితా నుండి తొలగించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎన్.రెడ్డి నగర్ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, శంకర్, రమేష్,రామణ, సుధాకర్ బాబు,బాలలింగం తదితరులు పాల్గొన్నారు.




రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన తెలంగాణ అస్తిత్వ వేధిక ఆవిర్భావ సభలో పాల్గోని ప్రసంగీస్తున్న తెలంగాణ న్యాయవాదుల జేఏసి రాష్ట్ర కన్వీనర్, పంచాయతిరాజ్ ట్రిబ్యూనల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్రెడ్డి తదితరులు.

## వివాస్పదంగా శిశు సంక్షేమ కేంద్రం నిర్మాణం

నాగారం, ఏప్రిల్ 20:-(వాయిస్ టుడే) : శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించే హాస్టల్ నిర్మాణం దినదినం వివాదాస్పదంగా మారుతుంది, హాస్టల్ నిర్మాణం కోసం నాగారం పరిధిలో 647 సర్వేనెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిని కేటాయించి ప్రభుత్వ సెలవు దినము ఆదివారం అయినప్పటికీ శ్రామిక మహిళా వసతి గృహం నిర్మాణం చేపట్టడమే ఏకైక లక్ష్యంగా అధికారులు స్వయంగా ముగ్గు పోసి హాస్టల్ నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు కానీ అధికారులు నేటి వరకు పనులు చేపట్టకుండా స్థల మార్పిడి కోసం అధికారులు తహతహలాడుతున్న తీరు స్థానికుల్లో దుమారం రేపుతోందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 647 సర్వేనెంబర్ కు చెందిన స్థలం ప్రభుత్వ స్థలం కాదా...?, ఈ స్థలం ప్రభుత్వ స్థలం కాకుండా ప్రైవేట్ స్థలం అయినచో ఈ స్థలంలో అధికారికంగా శ్రామిక మహిళా వసతి గృహం నిర్మాణం కోసం ఆదివారం స్వయంగా అధికారులు ముగ్గు పోసి ఈ స్థలం యజమానులను భయభ్రాంతులకు గురిచేసి అధికారులు విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారా...? లేక అధికారులు ఎలాంటి అధికార దుర్వినియోగానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి 647 సర్వేనెంబర్ కు చెందిన స్థలం పక్కా ప్రభుత్వ స్థలమే అని నిర్ధారించి హాస్టల్ నిర్మాణం కోసం ముగ్గు పోసి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన యెడల హాస్టల్ నిర్మాణం విషయంలో జాప్యం ఎందుకు వహిస్తున్నారు...? లేక ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఈ స్థలం కోట్ల విలువచేసే విలువైన స్థలం కావడంతో ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమాయక ప్రజలకు ప్లాట్లుగా విక్రయిస్తూ కోట్లు పంచుకోవడమే ఏకైక లక్ష్యంగా ఈ 647 సర్వేనెంబర్ కు చెందిన స్థలాన్ని కబ్జా చేసేందుకు చేపను పట్టేందుకు ఎరను దానగా వేసే చందంగా అక్రమార్కులు అధికారులను లోబర్చుకునేందుకు అక్రమ మార్గంలో తెరచాటుగా పెద్ద మొత్తంలో అందజేసే ముడుపులకు ముచ్చటపడి హాస్టల్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి ముగ్గు పోసి నిర్మాణానికి అనుకూలంగా ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని వదిలిపెట్టి విలువైన ఈ స్థలాన్ని అక్రమార్కుల హస్తగతం చేసేందుకు అధికారులు నిశ్చయించుకొన్నారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేరువేరు సర్వేనెంబర్లకు చెందిన స్థలాల్లో హాస్టల్ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయాలు తీసుకుంటూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా...? అనే విమర్శలు స్థానికుల నుండి వ్యక్తం అవుతున్నాయి.



## బసవేశ్వరుడు గొప్ప సంఘసంస్కర్త

**తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 20(వాయిస్ టుడే ): లింగాయత్ సమాజం తమ ఆరాధ్య దైవంగా భావించే బసవేశ్వరుడు గొప్ప సంఘసంస్కర్త అని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం బసవేశ్వరుని జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని లింగాయత్ లు నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్ బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొలుకుల జగన్ మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప కవి, తత్వవేత్త అని కొనియాడారు. 12వ దశాబ్దంలోనే కుల వ్యవస్థను, వర్ణ విభేదాలను, వ్యతిరేకించిన గొప్ప సంఘసంస్కర్తగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట. డివిజన్ లింగాయత్ అధ్యక్షులు. మల్లికార్జున్. శంకర్. రామ్ శెట్టి .బసవరాజు. జగదీశ్వర్ .బసవరాజు నాగప్ప .రాచన్న. శివ .మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ మల్లన్న స్వామి జాతర్లు పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో గల మల్లన్న స్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేతంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీ కామరతి సమేత బీరప్ప స్వామి కళ్యాణం, జాతర మహోత్సవంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ఆలయ సంఘం అధ్యక్షులు కంచిగారి కృష్ణ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు మహిళలు భక్తులు పాల్గొన్నారు.





## శ్రీ శ్రీ శ్రీ సమయపురం మారెమ్మ (మహాలక్ష్మి) అమ్మవారి మరియు శ్రీ రామలింగేశ్వర మరకత లింగ ఆలయాన్ని సందర్శించిన జె.కె. శేఖర్ యాదవ్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 20(వాయిస్ టుడే): భూదేవి హిల్స్ లోని మారెమ్మ టెంపుల్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అమ్మవారి టెంపుల్ సందర్శించిన జె.కె. శేఖర్ యాదవ్ ఆలయాన్ని వారు పరిశీలించి చాలా అద్భుతంగా కట్టారని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామకృష్ణ , చందల్ కుమార్ , శివరాజ్ , తిరుమల్ రెడ్డి , మల్లచారి , గిరిబాబు , విట్టల్ ముదిరాజ్ మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజల మనిషి ఏపి సీఎం చంద్రబాబు

నాగారం, ఏప్రిల్ 20:-(వాయిస్ టుడే): దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రజల మనిషి, తెలుగు ప్రజల శ్రేయోభిలాషి, ప్రియతమ నాయకుడు, నారా చంద్రబాబు నాయుడి 76వ జన్మదిన వేడుకలు నాగారంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వంలో తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయనీ ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు వందేళ్ళు ఆయురారోగ్యాలతో, మరిన్ని విజయాలతో ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వారు అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ, మేడ్చల్ నియోజకవర్గం, నాగారం 5వ డివిజన్‌లో కొండ సుజాత జంగారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఇంచార్జి సుంకరి వెంకటేష్, నాగారం మున్సిపాలిటీ 5వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి కొండ సుజాత, మాదిరెడ్డి యాదిరెడ్డి, కోటేశ్వరరావు, బ్రహ్మయ్య చౌదరి, ఆంజనేయులు, శివాజీ, ఉదిష్ణ శంకర్ గౌడ్, రంగారావు, తిమ్మాయపల్లి రాజు, బాలాజీ చౌదరి తదితర నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమానత్వం మరియు న్యాయం మనకు బసవేశ్వరుడు చూపిన మార్గాలు

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 20(వాయిస్ టుడే ): 130 - సుభాష్ నగర్ ఫార్టీ ఫీట్ రోడ్ నందు కర్ణబత్తుల సంక్షేమ సంఘం వారి శ్రీ బసవేశ్వర మైత్రి సేనా, కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ బసవేశ్వరా 893వ జయంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై బసవేశ్వర స్వామి వారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు..ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...సమానత్వం మరియు న్యాయం....ఇవే మనకు బసవేశ్వరుడు చూపిన మార్గాలు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సూర్య చందర్ రావు, దానకోట మల్లికార్జున్ రావు, మల్లేశ్వర్ రావు, దాన శివాజీ గణేష్, నాగ భూషణం, సత్యనారాయణ, సూరిబాబు, శ్రీను, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు బలరాం రెడ్డి, అడపా శేషు, ఇస్మాయిల్, గుబ్బల లక్ష్మీ నారాయణ, దుబాయ్ శ్రీను, రంగా, అడపా శేఖర్, సంతోష్ రెడ్డి, భద్రయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో ఘనంగా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు

**బసవేశ్వర బోధనలు యువతకు మార్గదర్శకం: కాట శ్రీనివాస్ గౌడ్**

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : శ్రీ బసవేశ్వర జయంతి సందర్భంగా బీరంగూడ కమాన్ వద్ద మహాత్మ శ్రీ బసవేశ్వర విగ్రహానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ బసవేశ్వరుడు సమాజంలో సమానత్వం, న్యాయం, మానవతా విలువలను స్థాపించడానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని శ్రీ బసవేశ్వరుని స్మరించుకున్నారు.



వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 21 ఏప్రిల్ 2026

## గన్నవరంలో ఘనంగా సీఎం చంద్రబాబు 76వ పుట్టినరోజు వేడుకలు

ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

మర్లపాలెంలో రూ.74 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



కృష్ణా జిల్లా–గన్నవరం(వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు గన్నవరం నియోజకవర్గం మర్లపాలెం గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం 76 కిలోల భారీ కేక్‌ను కూటమి నాయకులతో కలసి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్లపాలెం వద్ద రూ.74 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, గతంలో వివాదాలతో నిలిచిన గన్నవరం ఇప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఐటీ రంగానికి పునాది వేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు . బిల్ గేట్స్ వంటి ప్రముఖులు కూడా చంద్రబాబు ప్రతిభ ను మెచ్చుకున్నారని పేర్కొన్నారు. క్వాంటం వ్యాలీ వంటి ప్రాజెక్టులను అమరావతి తో పాటు గన్నవరం మేధా టవర్స్ కు తీసుకువచ్చారని తెలిపారు. సీఎం సతీమణి నారా భువనేశ్వరి అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, గన్నవరం ఏ.యం.సి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, టిడిపి నాయకులు దయాల రాజేశ్వరరావు, గూడపాటి తులసిమోహన్, కొలుసు రవీంద్ర, గొడ్డళ్ల చిన్న రామారావు, జాస్తి శ్రీధర్, మూల్పూరి సాయి కళ్యాణి, దొంతు చిన్నా, మొవ్వ వెంకటేశ్వరరావు, పొదిలి లలిత, కంభంపాటి లక్ష్మీనరసమ్మ, జొన్నలగడ్డ సుధాకర్, గండేపూడి నితీష్, బెజవాడ నాగేశ్వరరావు, బోడపాటి రవి, మేడేపల్లి రమ, మోదుగుమూడి సత్యనారాయణ, గుజ్జర్లపూడి బాబురావు, సర్నాల బాలాజీ, బుస్సే నాగప్రసాద్, తుమ్మల లత, నెక్కంటి శ్రీదేవి, గరికపాటి నాగలక్ష్మి, బుస్సే సరిత, తులిమెల్లి ఝాన్సీ, కానూరి శేషు మాధవి, చిమట రవివర్మ, షేక్ ఫిరోజ్, చల్లగుల్ల సందీప్, పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం, గండికోట సీతయ్య, కొల్లా ఆనంద్, అడుసుమిల్లి నవీన్, అన్నే హరికృష్ణ, తంగిరాల శ్రీనివాసరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, కొమ్మారెడ్డి రాజేష్, సందీప్, అరికట్ల రవి, యనమదల సతీష్, బండి భాస్కర్, మల్లారెడ్డి కిషోర్ మరియు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



## సీతాఫల్మండిలో ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే ప్రతినిధి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను సీతాఫలమండి లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని నామాలగుండు చౌరస్తా వద్ద జి.వి. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి, పండ్లు పంచిపెట్టారు. అనంతరం మధుర నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కుట్టి వేలోడి ఆసుపత్రి, రోగులకు, అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసే నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉలిక్కిపడ్డ గచ్చిబౌలి



గచ్చిబౌలి: గచ్చిబౌలిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. టీఎన్‌జీవోస్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో జేవీ ప్లాజా అనే ఐదంతస్తుల భవనంలో 24 పోర్షన్లు ఉన్నాయి. ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నివాసముంటున్నారు. సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో సెల్లార్‌లోని ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు పక్కనే ఉన్న పాత సోఫాలకు అంటుకోవడంతో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. నిమిషాల వ్యవధిలో అక్కడే నిలిపి ఉంచిన దాదాపు 20 ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. ఈ మంటలు, దట్టమైన పొగ పైఅంతస్తులకు వేగంగా పాకింది. భవనంలో ఉన్నవారు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రాణ భయంతో హాహాకారాలు చేస్తూ కొందరు కిందికి పరుగులు తీశారు. మరికొందరు పక్కనే ఉన్న భవనంపైకి దూకారు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మాదాపూర్, వట్టినాగులపల్లి స్టేషన్ల అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్లతో వచ్చి మంటలు అదుపు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. పై అంతస్తుల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో పాటు 16 మందిని క్షేమంగా కిందకు తీసుకొచ్చారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని అధికారులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గాజుల రాజశేఖర్ బాబు(27) పరిస్థితి విషమంగా ఉంది. 10 మంది అస్వస్థతకు గురయ్యారు. పోలీసు కమిషనర్ రమేష్ పరామర్శించారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా..

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్, ఎలక్ట్రానిక్ ) డైరీ ఆవిష్కరణలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చునని సూచించారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా) నూతన సంవత్సర -2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో జరిగింది. ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి,ఈ) అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, క్లబ్ ప్రధాన సలహాదారులు కంచుకట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. ఉప్పల్ ప్రాంత జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన ప్లాట్ల విషయాన్ని కూడా అసెంబ్లీలో లేవనెత్తానున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేలా ప్రయత్నం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేలా కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, వివిధ పార్టీల నాయకులు తాడూరి శ్రీనివాస్, గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకారపు అరుణ్ పటేల్, నెర్ధం భాస్కర్‌గౌడ్, కోల రవికుమార్‌గౌడ్, ఎండి. రఫిక్, కంది శ్రవణ్ కుమార్, జలీల్‌పాషా, గుడి మధుసూదన్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, పిట్టల నరేష్, తెలంగాణ సంపత్, నాగరాజు, చల్ల వీరారెడ్డి, మార్నేని ఫణీంద్ర, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, పూజల ప్రభాకర్, కొంపల్లి రవీందర్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు,సకినాల ప్రసాద్, మేకల దయాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, సంయుక్త కార్యదర్శి వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శులు ఆనంద నరసింహారెడ్డి, పంబిళ్ల కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఓంకార్ సంతోష్, పయ్యావుల సంతోష్, లీగల్ అడ్వైజర్ హైకోర్టు న్యాయవాది కోంద్రోన్ పల్లి గిరిబాబు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఘనంగా నవ్యాంధ్ర రూపశిల్పి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

**తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమం**

సికింద్రాబాద్ (వాయిస్ టుడే): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, నవ్యాంధ్ర రూపశిల్పి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో తార్నాకలో ఘనంగా నిర్వహించారు. "ప్రజల కోసం -- ప్రజల సేవలో" అనే నినాదంతో ఈ సందర్భంగా సమాఖ్య మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. మండే ఎండలను దృష్టిలో ఉంచుకుని వందలాది మంది బాటసారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జొన్నలగడ్డ శేషగిరి రావు ఆర్థిక సహకారం అందించి, సేవా దృక్పథంతో మజ్జిగ పంపిణీలో కీలక పాత్ర పోషించారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, వక్తలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాభివృద్ధిలో ఆయన పాత్ర విశిష్టమని కొనియాడారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన జొన్నలగడ్డ శేషగిరి రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడుసుమిల్లి చిట్టి వీరయ్య, నాగమల్లేశ్వరి మన్నె, నరేంద్ర బాబు కాట్రగడ్డ, జొన్నలగడ్డ శేషగిరి రావు, తోటకూర చంద్రమౌళి, కాండ్రు బుచ్చయ్య చౌదరి, పాటిబండ్ల నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు కనకమెడల రాంబాబు, సీబీఎన్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి శ్రీనివాసరావు, రావి జయదీర్‌తో పాటు స్థానిక ప్రముఖులు, స్వచ్ఛంద కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఓయూలో ఘనంగా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు

**పారిశుద్ధ్య కార్మికులకు గొడుగుల పంపిణీ**

**విద్యార్థులకు గ్రూప్స్ పుస్తకాల పంపిణీ...**



సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ, పుట్టినరోజు సందర్భంగా ఓయూ లో గత 30 ఏళ్లుగా మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న మహిళ పారిశుధ్య కార్మికులకు గొడుగులు పంపిణీ, విద్యార్థులకు గ్రూప్స్ పుస్తకాలు, అందజేసి అనంతరం 650 మంది ఓయూ ఉద్యోగులు,విద్యార్థులు, సిబ్బంది కి,బాటసారులకు మజ్జిక అందజేశారు. అంతకుముందు ఉదయం ఓయూ ఆర్ట్స్ కళాశాల దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబిఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ స్కూల్ ఆఫ్ సిబిఎన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు తలారి శ్రీనివాసరావు ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ వేమూరి నరేష్, వేణు, న్యూయో మెంటర్స్ అధినేత ముత్యాల.భారత్ , తలారి.నాగరాజు, నరేందర్, సైదులు, రాములు, తేజ, విశ్వం, రాము,రాజు ,గిరి, పారిశుద్ధ కార్మికులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. బాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా మూడుసార్లు ప్రతిపక్ష నాయకుడిగా 44 సంవత్సరాల తెలుగు దేశం పార్టీని బలోపేతం చేసిన గొప్ప వ్యక్తిని అన్నారు. క్వాంటం టెక్నాలజీని అభివృద్ధి చేస్తూ హైదరాబాద్ నగర అభివృద్ధికి బాటలు వేస్తున్న గొప్ప నేతని అన్నారు.

# తైక్వాండోను మార్షల్ ఆర్ట్‌ను ప్రోత్సహించాలి

**ఉత్కంఠభరితంగా ముగిసిన తైక్వాండో ప్రీమియర్ లీగ్ సీజన్ 2**



హైదరాబాద్, ఏప్రిల్ 20: తైక్వాండో ప్రీమియర్ లీగ్ సీజన్ 2 పురుషుల విభాగం మొదటి లెగ్ పోటీలు హైదరాబాద్‌లోని ఓ హోటల్ లో ఘనంగా నిర్వహించారు . దేశంలోని అత్యుత్తమ తైక్వాండో క్రీడాకారులు తమ అద్భుతమైన ప్రతిభతో, క్రమశిక్షణతో పోరాట పటిమతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. పోటీలలో జాతీయ, రాష్ట్ర స్థాయి అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ సభలో ముఖ్య అతిథులుగా రాజేష్ అగర్వాల్ , సందీప్ జైన్ పాల్గొని లెగ్ 1 విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి జట్టు తమదైన వ్యూహాలతో పోరాడి, భారతదేశంలో తైక్వాండో క్రీడకు ఈ లీగ్ ఒక గొప్ప వేదిక అని నిరూపించాయని పేర్కొన్నారు. తైక్వాండో ప్రీమియర్ లీగ్ ఫౌండర్ డైరెక్టర్ గణేష్ దువ్వూరి మాట్లాడుతూ... గ్రామీణ స్థాయి నుంచి తైక్వాండోను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని, క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అవకాశాలు కల్పించేందుకు లీగ్ కృషి చేస్తుందన్నారు. భారతదేశంలో మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి యువ క్రీడాకారులను ప్రోత్సహించడంలో తైక్వాండో ప్రీమియర్ లీగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలి

## సీబీఐ జాయింట్ డైరెక్టర్ జె.డి. లక్ష్మీనారాయణ...

## డీపీఎస్ & పల్లవి విద్యాసంస్థల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు...



సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. డీపీఎస్?, పల్లవి విద్యాసంస్థలు విద్యా ప్రమాణాల్లో మేటిగా నిలుస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని ఆయన తెలిపారు. డీపీఎస్?, పల్లవి విద్యాసంస్థల నుంచి సీబీఎస్?ఈ టెన్త్? లో అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం బాగ్ లింగంపల్లి లోని ఆర్టీసీ కళ్యాణ మండపం ఆడిటోరియంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి డీపీఎస్?, పల్లవి విద్యాసంస్థల చైర్మన్?, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, సీఈవో మల్క యశస్విలతో కలిసి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరైవిద్యార్థులను అభినందిస్తూ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, డీపీఎస్ ఢ పల్లవి గ్రూప్ ఛైర్మన్ మల్కా కొమరయ్య, మట్లాడుతూ.. ఇటీవల వెలువడిన సీబీఎస్?ఈ పదో తరగతి ఫలితాల్లో డీపీఎస్?, పల్లవి విద్యాసంస్థల విద్యార్థులు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమన్నారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థులు 95 శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులై సరికొత్త రికార్డు సృష్టించడం వెనుక విద్యార్థుల నిరంతర శ్రమ, టీచర్ల సమర్థవంతమైన బోధన, తల్లిదండ్రుల కృషి ఉందన్నారు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పేరుపేరునా అభినందించారు."మా విద్యాసంస్థల విద్యార్థులు సాధించిన ఈ విజయం మా అందరికీ గర్వకారణమన్నారు. విద్యాసంస్థల సీఈఓ మల్కా యశస్వి మాట్లాడుతూ... విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పేరుపేరునా అభినందించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం అందరికీ గర్వకారణం అన్నారు.100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, ఇంతటి భారీ స్థాయిలో టాపర్లు రావడం తమ విద్యాసంస్థల క్వాలిటీ ఎడ్యుకేషన్? కు నిదర్శనమని, మా ఉపాధ్యాయ బృందం మరియు ప్రిన్సిపాల్స్ కృషితోనే ఇది సాధ్యమైంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం మేము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. డైరెక్టర్ ఏ. సుశీల్ మాట్లాడుతూ... విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. విద్యలో విజయాలు మనకు వినయాన్ని నేర్పి, గొప్ప పనులు చేయడానికి ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. వారు విద్యార్థుల కృషిని అభినందించి, కేవలం విద్య మరియు విజయాల పై దృష్టి పెట్టడం కంటే, విద్య, జ్ఞానాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడమే మన అవసరమని చెప్పారు. విజయాలు మనకు వినయాన్ని నేర్పి, గొప్ప పనులు చేయడానికి ప్రేరణను ఇవ్వాలి. వినయంతో మనం లక్ష్య సాధకులుగా ఉండాలి అన్నారు. నగరవ్యాప్తంగా ఉన్న వివిధ పల్లవి, డిపిఎస్ స్కూల్స్ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్ అందరూ పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యార్థుల ముఖాల్లోని చిరునవ్వులు, తల్లిదండ్రుల కళ్లలోని ఆనందం విద్యాసంస్థల విలువలను చాటి చెప్పాయి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ యాజమాన్యం వారికి ప్రత్యేక ఆశీస్సులు అందజేసింది.

## దళిత సేవకు గుర్తింపు..దళిత రత్న అవార్డు

### దళిత రత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

కాజీపేట,వాయిస్ టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మహనీయుల జయంతి సందర్భంగా సమాజ సేవ చేసిన దళితులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక 'దళిత రత్న అవార్డు'ను ఈ ఏడాది కాజీపేట పట్టణం 63వ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన బొల్లె కుమారస్వామి,నీరటి సాయిరాజ్‌లకు ప్రదానం చేశారు. ఇటీవల అవార్డులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇటీవల రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సమాజ సేవలో విశేష కృషి చేసిన దళిత ప్రముఖులకు దళిత రత్న అవార్డుల ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న బొల్లె కుమారస్వామి,నీరటి సాయిరాజ్‌లను సోమవారం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, కాలనీ పెద్దమనుషులు పూల మాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో కాలనీ పెద్దమనుషులు బొక్క స్వామి,కాదాసి రామస్వామి,మంద శ్రీనివాస్, శని గరపు కుమారస్వామి,నల్ల వెంకటస్వామి,అంబాల శ్రీనివాస్‌లతో పాటు అంబేద్కర్ నగర్ యువజన సంఘం అధ్యక్షులు జన్ను ప్రవీణ్,ప్రధాన కార్యదర్శి ఇంద రఘు,కోశాధికారి శివగళ్ల సుందర్, హైదరాబాద్ చందన,మంద ప్రియాంక మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## హరీశ్ రావు పై మంత్రి తుమ్మల సీరియస్

### ప్రెస్మీట్లో మంత్రి తుమ్మల కామెంట్స్

ఖమ్మం బ్యూరో,ఏప్రిల్ 20 ( వాయిస్ టుడే) : బీ.ఆర్.ఎస్‌లో తగిన ప్రాధాన్యం లేక హరీష్ రావు మెంటల్ బ్యాలెన్స్ తప్పారు. భూకబ్జాలు గూర్చి నీతులు చెప్పే హరీష్ రావు నిన్న మీటింగ్ పెట్టింది కబ్జా కోరుల స్థలంలోనే కాళేశ్వరరావు గా ముద్రపడ్డ హరీష్ రావు కాంగ్రెస్ కు నీతులు చెబుతున్నారు. హరీష్ రావు సొంత పార్టీలో రాజకీయ భవిష్యత్ కోసం మానసిక దౌర్భాగ్యంతో మాట్లాడుతున్నారు . కబ్జాదారుడు అవినీతి కాంట్రాక్టర్ ను పక్కన పెట్టుకుని నీతులు చెబుతున్నారు. సిగ్గు లేకుండా ఏ మోహం పెట్టుకుని మళ్ళీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారు. రుణమాఫీ పై మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావుకు లేదు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒకే సారి రెండు లక్షల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది. మీ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. కబ్జాలు కమీషన్ల విషయంలో దేశంలోనే ఏ పార్టీకి లేని చరిత్ర మీది. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో సీతారామ ప్రాజెక్టు గూర్చి మీ గొప్పగా చెబుతున్నారు కానీ మీ పాలనలోనే పడావు పడేశారు. సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతులు లేకుండా కమీషన్ల కోసం ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యం చేశారు. మీ పాలనలో నిలిచిన సీతారామ ప్రాజెక్టు సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేస్తున్నాం. సీతారామ ప్రాజెక్టు గూర్చి మాట్లాడే నైతిక హక్కు లేదు. నీ సిద్దిపేటకు వస్తా రైతాంగం శ్రేయస్సు కోసం స్ట్రాటజిక్ లొకేషన్ లో పెట్టిన పామాయిల్ ఫ్యాక్టరీ పై చర్చకు సిద్ధమా..




## ఘనంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ డ్యూటీస్ డే వాక్‌థాన్

సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే ప్రతినిధి): ఇంటర్నేషనల్ హ్యూమన్ డ్యూటీస్ డే సందర్భంగా సికింద్రాబాద్‌లో వాక్‌థాన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. జెసిఐ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్, సేత్ మణిక్లాల్ అగర్వాల్ హోమియో క్లినిక్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ జేసీ క్విని విక్టోరియా నాయకత్వం వహించగా, 40 మందికి పైగా జేసీఐ సభ్యులు, అతిథులు పాల్గొన్నారు. వాక్‌థాన్‌లో పాల్గొన్న సభ్యులు పార్క్ పరిధిలో నడుచుతూ ఇంటర్నేషనల్ హ్యూమన్ డ్యూటీస్ డే పై సందేశాలను ప్రదర్శించే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సభ్యులు ప్రజలతో మమేకమై, హక్కులతో పాటు బాధ్యతలు కూడా సమానంగా ముఖ్యమని అవగాహన కల్పించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాలను గుర్తుంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పాల్గొన్న వారికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ వాక్‌థాన్ ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యంతో పాటు సామాజిక బాధ్యతలపై అవగాహన పెంచడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జేసీఐ సికింద్రాబాద్ పరడైస్ కార్యకలాపాలకు మంచి గుర్తింపు లభించిందని, వాకర్స్ క్లబ్‌తో సహకారం మరింత బలోపేతమైందని తెలిపారు. సర్వీస్టూ ఇమానిటీ ఇస్ ద బెస్ట్ వర్క్ అఫ్ లైఫ్ అనే జేసీఐ లక్ష్యాన్ని మరోసారి ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం విజయవంతమైంది అని జేసీఐ సికింద్రాబాద్ పరడైస్ అధ్యక్షురాలు జేఎఫ్ఎం శిల్పలింగా తెలిపారు.

## జే.కే.యం సోలార్ ఎనర్జీ కార్యాలయము ప్రారంభించిన డా.తుమ్మల యుగంధర్

ఖమ్మం, ఏప్రిల్ :20 ( వాయిస్ టుడే ): ఖమ్మం బైపాస్ రోడ్ లోని టీ.వీ.ఎస్ షోరూం కు ఎదురుగా ఉన్న బిల్డింగ్ లో, ఆదివారం జే.కే.యం సోలార్ ఎనర్జీ కార్యాలయము మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఖమ్మం ప్రజలకు సోలార్ విద్యుత్ అనేది ఒక అద్భుత అవకాశంగా భావించాలి. ఈ జే.కే.యం సోలార్ ఎనర్జీ స్థాపించిన, మెర్సీ ఏంజెల్ జె.కె మహేష్ కు అభినందనలు తెలియజేస్తూ, ఈ సోలార్ పథకం ద్వారా మీరు 78,000 సబ్సిడీ ఉంది. కరెంట్ బిల్లు భారాన్ని తగ్గించి, ఆదాయం పొందే విధంగా, మిగులు విద్యుత్ ను ప్రభుత్వ సంస్థలకు అమ్ముకొని ఆదాయం పొందవచ్చు అని, ఈ సందర్భంగా తెలియజేసారు.

జే.కే.యం సోలార్ ఎనర్జీ అధినేత మెర్సీ ఏంజెల్ జె.కె మహేష్ మాట్లాడుతూ, విద్యుత్ బిల్లు భారం, కాలుష్యం తగ్గించేలా, పీ.ఎం సూర్యఘర్ పథకంతో 3 కిలో వాట్ -10 కిలో వాట్ సోలార్ కి, రూ.78,000/- వరకు సబ్సిడి పొంది, కరెంటు బిల్లు భారాన్ని తగ్గించి, ఆదా-ఆదాయం పొందే విధంగా మీ ఇంటిపై సోలర్ ఏర్పాటు చేసుకొనే వారికి సబ్సిడితోపాటు మిగులు విద్యుత్ ను ప్రభుత్వ సంస్థలకు అమ్ముకొని, ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం సోలార్ ఉపయోగాలు వివరిస్తూ, ప్రతి నెల 360-750 యూనిట్స్ జనరేట్ కి అవకాశం.




ప్రతి నెల మీరు చెల్లించే విద్యుత్ బిల్లుకు బదులుగా 5-10సం॥లు ఈజీ ఈ.ఎం.ఐ చెల్లించకుంటే 20-25 సం॥ల వరకు ఉచితంగా విద్యుత్ వాడుతూ, మిగిలిన విద్యుత్ను ప్రభుత్వానికి ఇచ్చి ఆదాయం పొందవచ్చు. ఈ సోలార్ యూనిట్ కు 25 సం॥ల వారంటీ మరియు 5 సం॥ల ఉచిత సర్వీస్ ఉంటుంది. మీవద్ద 0 డౌన్ పేమెంట్, 0 సర్వీస్ చార్జి, 0 సైట్ విసిట్ చార్జి 0 అప్లికేషన్ చార్జి మరియు మీ వద్ద నుండి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఈజీ ఈ.ఎం.ఐ తో ఇన్స్టాలేషన్ చేస్తాము. ఉచిత సర్వీస్ అందిస్తాము. విద్యుత్ ఖర్చులు తగ్గించి గ్రీన్ పవర్ సాదించేందుకు ఇది ఒక మార్గం. మొదటి 100 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అదనంగా రు.10,000/- వరకు డిస్కౌంట్ ఇవ్వబడును. మీ గృహ మరియు వ్యవసాయ అవసరాలకు సోలార్ ఫెన్సింగ్ లైట్, పొలాల బోర్ మరియు పంపుసెట్ లకు, పరిశ్రమలకు సోలార్ ఫిట్టింగ్ చేయబడును అని తెలుపుతూ, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ చైర్మన్ యర్లగడ్డ హనుమంతరావు, డివిజన్ కార్పరేటర్ రాపర్తి శరత్, అశ్రీఫ్, విగ్నేష్ , యుగంధర్, బద్రుల్ల, నరాల నరేష్, మూర్తి, కిరణ్, బాచి, ఉదయ్, క్రాంతి, ఓం ప్రకాష్, సుమన్, సందీప్, దినాకర్, అశోక్, ముజీబ్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రముఖ విద్యావేత్త బి.కె. మూర్తి సేవలు ఆదర్శనీయం

### నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందించిన బాలకృష్ణమూర్తి సార్

### బిసిటియు వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి

కాజీపేట,వాయిస్ టుడే: ప్రముఖవిద్యావేత్త,వేదపండితులు పరిటాల బాలకృష్ణమూర్తి సేవలు ఆదర్శనీయమని బిసిటియు వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి కొనియాడారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో బిసిటియు వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న పెరుమాండ్ల సాంబమూర్తి,సరస్వతి కుటుంబ సభ్యులను సోమవారం బాలకృష్ణమూర్తి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బాలకృష్ణమూర్తికి ఫలాలను అందించి సాంబమూర్తి దంపతులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ ఆత్మకూరు మండల పరిధిలోని పెంచికలపేట గ్రామంలో పద్మ ఉన్నత పాఠశాలను నెలకొల్పి అనేక ఏళ్లపాటు విద్యాభివృద్ధికి నిరంతరంగా శ్రమించారని తెలిపారు. నీరుకుళ్ళ,పెంచికలపేట,కేశవాపురం గ్రామాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా పద్మ ఉన్నత పాఠశాలలో చదువుకునే వారని తెలిపారు. నిరుద్యోగులకు తమ బడిలో టీచర్లుగా ఉద్యోగం కల్పించి వారి బావి జీవితానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. వందలాది మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించి వారి ఉన్నత శిఖరాలకు ఎదగడానికి తోడ్పాటును అందించిన ఘనత బాలకృష్ణమూర్తి సార్ కు దక్కుతుందన్నారు. బాలకృష్ణమూర్తి సార్ నేతృత్వంలో కొనసాగిన పద్మ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులంతా డాక్టర్లుగా,ఇంజనీర్లుగా,లెక్చరర్లుగా,టీచర్లుగా,ప్రముఖ విద్యా సంస్థల వ్యవస్థాపకులుగా నేడు అనేక హోదాల్లో కొనసాగుతుండడం విశేషం అన్నారు. బాలకృష్ణమూర్తి సార్ రుణం తీర్చుకోలేనిదన్నారు. విద్యా దానం చేయడంలో ఆయనకు ఆయనే పరిపాటి అన్నారు. సార్ విద్య సేవలను స్ఫూర్తిగా తీసుకునీ తాము విధులను నిర్వర్తిస్తున్నామని సాంబమూర్తి దంపతులు తెలిపారు. అంతకుముందు సాంబమూర్తి దంపతులకు "హౌ టు బి ఏ గుడ్ టీచర్" అనే పుస్తకాన్ని బాలకృష్ణమూర్తి సార్ అందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని,పేద విద్యార్థుల జీవితాల్లో మరింత వెలుగులు నింపాలని సూచించారు.




## గోవుల సంరక్షణ అందరి బాధ్యత

తొర్రూరు, ఏప్రిల్ 20 వాయిస్ టుడే : గోవుల సంరక్షణ అందరి బాధ్యతగా మారాలని వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ తొర్రూరు అధ్యక్షులు బిజ్జాల వెంకటరమణ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని వేణుగోపాలస్వామి గోశాల కు వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ తొర్రూరు అధ్యక్షులు బిజ్జాల వెంకటరమణ ఆధ్వర్యంలో రూ.1 లక్ష విరాళంగా అందించారు. గోశాల అవసరాల నిమిత్తం ట్రాక్టర్ కొనుగోలుకై సదరు మొత్తాన్ని వినియోగించనున్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని గోశాలలో రూ.1 లక్ష విరాళాన్ని వెంకటరమణ గోశాల అధ్యక్షులు దారం కుమారస్వామి వర్కింగ్ ప్రెసిడెంట్ కర్రా అశోక్ రెడ్డి గారికి అందజేశారు.

గోశాల నిర్వాహకులు దాత వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. గోవుల సంరక్షణకు పాటుపడుతున్న స్థానిక గోశాలకు తోడ్పాటు అందించాలనే సంకల్పంతో ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ప్రకృతిలోని చెట్టూ చేమా, రాయీ రప్ప, పక్షులు, జంతువులు, మనకు అన్నీ పూజనీయాలే కానీ అగ్రస్థానం మాత్రం గోవుదేనన్నారు. సర్వ దేవతా స్వరూపమే గోవు అని, 33 కోట్ల దేవతలకు నిలయం గోవు శరీరం అన్నది మన నమ్మకమన్నారు. ప్రతి ఒక్కరూ గోవులను పూజించి గోమాత ఆశీస్సులు పొందాలని కోరారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని అనుసరించాలని, గోమాతను పూజించాలని కోరారు. గో సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీసీ ప్రొద్దుటూరు గౌరీశంకర్ , వీడీజీ రామ ఉపేందర్, జెడ్ సీ 3 శ్రవణ్ కుమార్, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ ప్రధాన కార్యదర్శి నాళ్ళ కృష్ణమూర్తి, కోశాధికారి కొండ్లె చంద్రయ్య, గోశాల ప్రధాన కార్యదర్శి నాల్ల కృష్ణమూర్తి, కోశాధికారి ధార నాగ శివప్రసాద్, భాస్కర్ రెడ్డి, కల్లూరి నాగేంద్ర చారి, పి వెంకటేశ్వర్లు, పి రుద్రదేవ్, డి ప్రభావతి, టీ కరుణశ్రీ, ఎన్ అనసూయ పాల్గొన్నారు.

## హన్మకొండలో బంగారు గొలుసు దొంగతనం

### 28 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సిఐ రంజిత్ కుమార్

హన్మకొండ,వాయిస్ టుడే: సోమవారం ఉదయం 10గంటల సమయంలో హన్మకొండలోని ఎక్సైజ్ కాలనీ పరిధిలో గల వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో గుర్తుతెలియని దుండగులు ఇద్దరు మోటార్ సైకిల్‌పై వచ్చి ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలోని 28 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారైన ఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన చింతల కల్పన ఉప్పు ప్యాకెట్ కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఎదురుగా మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు 28 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని మోటార్ సైకిల్ పై పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సుబేదారి ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఘటనాస్థలిని పరిశీలించి భాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిందితులను గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు తెలిపారు.



## ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం,ఏప్రిల్ 20( వాయిస్ టుడే): అభివృద్ధి పనులపై అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి తుమ్మల ఖమ్మం జిల్లాతో పాటు ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సమీక్ష జరిపారు. ఖమ్మం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఖమ్మం నగరంలో నిర్మాణం జరుగుతున్న కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పై ఆర్ అండ్ బి అధికారులతో చర్చించారు. ఖమ్మం నగరంలో నిర్మాణం జరుగుతున్న సైడ్ డ్రైన్ల నిర్మాణం దగ్గర నుంచి అభివృద్ధి పనులకు సంబంధించి ఒక్కొక్కటిగా పనుల పురోగతిపై తుమ్మల అధికారులతో మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు సంబంధించి తెలుసుకున్నారు వెంటనే పనులు పూర్తి చేయాలని మరోసారి ఖమ్మం నగర ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా చూడాలని తుమ్మల అధికారులను ఆదేశించారు నిర్దేశించిన లక్ష్యాలలోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని తుమ్మల అధికారులను ఆదేశించారు. పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో తుమ్మల పాఠశాలలకు సంబంధించిన అంశాలను చర్చించారు పనుల వేగంగా పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు.



## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

ఖమ్మం, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే ): ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించా లని అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ పి. శ్రీనివాస్ రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రాయల గోవింద రావు పీఎం ఉపాధి కల్పన పథకం క్రింద ఈడిపి ట్రైనింగ్ అందుబాటులో లేకపోవడం ఆన్లైన్ పోర్టల్ లోపల లోన్ ప్రాసెస్ ఆలస్యం అవుతున్న విషయం గురించి ఫిర్యాదు అందించగా కే.వి.ఐ.బి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కొణిజెర్ల మండలం చిన్న గోపతీ గ్రామానికి చెందిన జి. ప్రసాద్ రావు తనకు సర్వే నెంబర్ 131 లో 39 గుంటల భూమి ఉందని, 19.5 గుంటల భూమి పట్టా పాస్ పుస్తకం ఉందని, మిగిలిన 19.5 గుంటల భూమి పట్టా పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలం అల్లిపురం గ్రామానికి చెందిన ఎస్కే హుస్సేన్ తనకు 4 సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చిందని , తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డిఆర్డిఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

## పారిశుధ్యం వ్యాధులకు అడ్డుకట్ట...

### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



ఖమ్మం, ఏప్రిల్ 20 ( వాయిస్ టుడే ): పారిశుధ్యం ప్రాధాన్యంతో డెంగ్యూ, మలేరియా వ్యాధులకు ముందస్తుగా అడ్డుకట్ట వేయవచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూలి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లాలో వెక్టర్ బార్న్ ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లా అధికారులు ఫీల్డ్ సందర్శనలు నిర్వహించే సమయంలో ఎక్కడైనా పారిశు ధ్యం మెరుగుపరచాల్సిన అవసరం ఉంటే వెంటనే సంబంధిత పంచాయతీ లేదా మున్సిపాలిటీ దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమలు నీటిలో పెరుగుతాయని, ఎక్కడా నీటి నిల్వలు ఉండకూడదని, తాగునీటి లీకేజీలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న పొదలను తొలగించి దోమల పెరుగుదలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రజల్లో పారిశుధ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి వెక్టర్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, మలేరియా, డెంగ్యూ కేసులను వెంటనే గుర్తించి చికిత్స అందించాలనిసూచించారు. ప్రతి గ్రామంలో మే నెలలోనే ఆయిల్ బాల్స్ సరిపడా నిల్వ ఉంచాలని, మండల స్పెషల్ అధికారులు తమ పర్యటనల్లో వాటి నిల్వలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పి.హెచ్.సీ స్థాయిలో అవసరమైన టెస్ట్ కిట్లు, మందులు సిద్ధంగా ఉంచాలని, దీనికి డీఎంహెచ్ఓ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదయ్యే డెంగ్యూ కేసులను తప్పనిసరిగా నోటిఫై చేయాలని, ఆ ప్రాంతాల్లో తక్షణ పారిశుధ్య చర్యలు, టెస్టింగ్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న నిర్మాణ పనులు, ప్రాజెక్ట్ ప్రాంతాలను పరిశీలించి దోమల పెరుగుదలకు అనుకూలమైన ప్రదేశాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వినియోగించాలనీ సూచించారు. గత చరిత్ర ఆధారంగా గుర్తించిన హాట్ స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూలి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మిల్లర్లు తప్పనిసరిగా నాణ్యమైన ధాన్యాన్ని స్వీకరించే విధంగా చూడాలని, కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని ఆదేశించారు.

# ఖమ్మంలో ఘనంగా మేధావుల సదస్సు

ఖమ్మం,ఏప్రిల్ 20.( వాయిస్ టుడే ): ఖమ్మం నగరంలోని ఐఎంఎ హాల్ లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 'మేధావుల సదస్సు' ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ మహా సభకు డాక్టర్ కొప్పు కాంతి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సకల జనుల సంక్షేమం కోసం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్వతంత్ర భారతానికి ఒక విశిష్టమైన రాజ్యాంగం అవసరమైనప్పుడు విదేశాల నుంచి మేధావులను తీసుకురావాలని నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ భావించారని, అయితే మహాత్మా గాంధీ సూచనతో ఆ బాధ్యతను అంబేద్కర్‌కు అప్పగించారని గుర్తుచేశారు. ఎన్నో దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, దేశంలోని అన్ని వర్గాలకు, మతాలకు, కులాలకు సమాన హక్కులు కల్పిస్తూ అద్భుతమైన రాజ్యాంగాన్ని ఆయన దేశానికి అందించారని కొనియాడారు. కానీ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించిందని, పార్లమెంట్ తలుపులు మూసివేసి ఆయనను చట్టసభల్లో అడుగుపెట్టకుండా అడ్డుకోవడంతో పాటు ఎన్నికల్లో కుట్రపూరితంగా ఓడించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దళితుల పాలిట పచ్చగడ్డిలో పసిరిక పాము లాంటిదని ఆయన అభివర్ణించారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ కేవలం తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుందని, చరిత్రలో ఆయనకు దక్కాల్సిన 5 దక్కకుండా చేసిందని విమర్శించారు.



ఈ సందర్భంగా ఇతర వక్తలు సదస్సును కొనసాగిస్తూ.. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని, ఆయన ఎదుర్కొన్న వివక్షను సభికులకు సోదాహరణంగా వివరించారు. సమాజంలో మహిళలకు సమాన హక్కులు కల్పించే ఉద్దేశ్యంతో అంబేద్కర్ ప్రతిపాదించిన హిందూ కోడ్ బిల్లుకు నాటి కాంగ్రెస్ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని, దానికి మనస్తాపం చెందే ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారని నాయకులు గుర్తుచేశారు. ఒక వర్గానికే పరిమితం చేయాలని చూసిన కుట్రలను ఛేదిస్తూ, యావత్ భారతదేశానికీ, అన్ని వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రమే అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నిజమైన పాలన అందిస్తోందని నేతలు స్పష్టం చేశారు. రెండు వేల పద్నాలుగులో మోదీ ప్రధాని అయిన నాటి నుంచి దళిత, బడుగు బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ఎన్నో అద్భుతమైన పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని కొనియాడారు. అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పంచ తీర్థాలను అభివృద్ధి చేయడంతో పాటు, ఎంతో మంది మరుగున పడిన దళిత, బహుజన వీరుల చరిత్రను దేశానికి పరిచయం చేసిన ఘనత కేవలం భారతీయ జనతా పార్టీకే దక్కుతుందని ప్రశంసించారు. దళితుల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ అని ఉద్ఘాటించారు. ఈ అద్భుతమైన సదస్సులో భాగంగా సమాజ నిర్మాణంలో విశేష కృషి చేస్తున్న పలువురిని నాయకులు ఘనంగా సత్కరించారు. అత్యున్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ వర్గానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను, మేధావులను వేదికపై ప్రత్యేకంగా సన్మానించారు.



## జావీద్ కుటుంబాన్ని పరామర్శించిన వి హనుమంతరావు

ఖమ్మం, ఏప్రిల్ 20( వాయిస్ టుడే ): ఇటీవల యాక్సిడెంట్ లో మరణించిన మాజీ నగర కాంగ్రెస్ అధ్యక్షులు పీసీసీ మెంబర్ జావీద్ కుటుంబం ను ఇంటికి వచ్చి పరమశించి నా మాజీ ఎంపీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి హనుమంత్ రావు అనంతరం కుటుంబం సభ్యులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర కార్పొరేటర్లతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు .

### పార్టీలో పని చేస్తూ రియల్ ఎస్టేట్ చేసేవాడు.

పార్టీ ఇచ్చిన ఏ ప్రోగ్రాం అయినా తుచ తప్పకుండ చేసేది. జావీద్ చనిపోవడం కాంగ్రెస్ కి తీరని లోటు..కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి నీ అడుగుతా పీసీసీ అధ్యక్షులు కి తెలియచేస్తాం..జావీద్ కి చెందాల్సిన పదవి ఏదైనా ఉంటే వారి కుటుంబం లో ఒకరికి ఇవ్వాలి..జావీద్ పెద్దకూతురు కూడా చదువుకున్న అమ్మాయి తండ్రి లాగా పని చేయాలనీ ఉంది కాబ్బట్టి ఆమెకి పదవి ఇవ్వాలి. పది సంవత్సరాలు అధికారం లేకపోయినా పని చేసిన వ్యక్తి జావీద్..మహిళలు కి బీసీ, ఎస్ టీ,మైనార్టీ కి పదవి ఇవ్వాలి అనేది ప్రియాంక రాహుల్ ఆలోచన అదే విదంగా వీరికి న్యాయం జరగాలి ..జావీద్ కాంగ్రెస్ గెలిపించడం లో కృషి చేసినట్లు ఆమె కూతురు శహెళా కూడా కృషి చేస్తుంది అని నా నమ్మకం.



## తెలంగాణ ఉద్యమకారులకు కృతజ్ఞతలు

### డాక్టర్ కే.వీ. కృష్ణారావు

ఖమ్మం , ఏప్రిల్ 20 ( వాయిస్ టుడే ) తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (రిజిస్టర్డ్) సంఘం పిలుపుమేరకు ఖమ్మం జిల్లా నుండి వెళ్లి సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఉద్యమకారునికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలను తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.వీ.కృష్ణారావు , ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య తెలిపారు .

### కల్వకుంట్ల కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు

సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారును హైదరాబాదులో పోలీసులు అరెస్టు చేసి మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ లో ఉంచారని తెలుసుకొని పరామర్శించడనికి వచ్చిన శ్రీమతి కల్వకుంట్ల కవిత కు తెలంగాణ ఉద్యమకారుల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.వీ. కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు . లేని పక్షంలో ప్రజా ప్రతినిధులను అడుగు అడుగున నిలదీయావలసి వస్తుందని హెచ్చరించారు . ముందు ముందు ఇలాగే ఉద్యమకారులు సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బచ్చుల పద్మాచారి , నెలవెల్లి వెంకటేశ్వరావు , భుక్య శ్రీనివాస్ నాయక్ , గొట్టిపర్తి శ్రీనివాస్ , మల్లెబోయిన వెంకయ్య , బొమ్మ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## వల్లభి ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీఓ వాల్మీకి కిషోర్



ముదిగొండ మండలం ఏప్రిల్ 20 వాయిస్ టుడే: ఖమ్మం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అదనపు కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ముదిగొండ మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) వాల్మీకి కిషోర్ సోమవారం వల్లభి గ్రామంలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆయన వసతి గృహ ప్రాంగణాన్ని, విద్యార్థుల గదులను మరియు పరిసరాల పరిశుభ్రతను నిశితంగా పరిశీలించడమే కాకుండా, హాస్టల్‌కు సంబంధించిన హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు వంటి కీలక రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన ఎంపీఓ, అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని హెచ్చరించారు.



## విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలు

### ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే); ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సంక్షేమ వారోత్సవాలను ముస్తాబాద్ కేజీబీవీ లో ప్రారంభించిన ప్రభుత్వ విప్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్. విద్యాభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుం టుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణ లో భాగంగా సంక్షేమ వారోత్సవాలను ముస్తాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో కిచెన్ అండ్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి సోమవారం ప్రారంభించారు. కిచెన్, డైనింగ్ హాల్ ఆవరణ, ఫ్రీజర్లు పరిశీలించారు.




## పిట్లంలో తెలంగాణ జాగృతి నూతన పార్టీ పోస్టర్ ఆవిష్కరణ

పిట్లం, ఏప్రిల్ 20 వాయిస్ టుడే ప్రతినిధి : ఈ నెల 25న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండల కేంద్రంలో స్థానిక జాగృతి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ లక్ష్యాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షులు ఆదిల్, మండల జాగృతి అధ్యక్షులు నీలకంటి మనోహర్, మండల అధ్యక్షులు అభ్యాన, యూత్ అధ్యక్షులు అబ్రార్, సభ్యులు ప్రశాంత్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృభూమి సేవ,సమాజ సేవ కోసం వందేళ్లుగా ఆర్ఎస్ఎస్

## ధర్మ, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ,దేశ హితం కోసం ఆర్ఎస్ఎస్,అనుబంధ విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయి.

### ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ జి




తిమ్మాపూర్,ఏప్రిల్ 20(వాయిస్ టుడే):మాతృభూమి సేవ కోసం,సమాజ సేవ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముక్ సామల కిరణ్ జి అన్నారు.తిమ్మాపూర్ ఉపమండలం శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి,ఆధ్వర్యంలో బొంతల కళ్యాణ్ చంద్ర అధ్యక్షతన హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది.ఈ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య వక్తక హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా దేశాహితం కోసం,హిందూ ధర్మ,సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగాలు సైతం అదే లక్ష్యంతో ఆయా రంగాలలో రాణిస్తున్నాయన్నారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నా యన్నారు. ఆర్ఎస్ఎస్ నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు.ముఖ్యంగా సామాజిక సమరత,పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్,స్వదేశీ ఆచరణ, పౌర బాధ్యత నియమాలు అనే ఐదు అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.ప్రస్తుతం హిందూ సమ్మేళనాలు హిందూ సమాజం ఐక్యతతో కొనసాగాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజనతో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని,హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం,ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతోకొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు.హిందూ ధర్మం ఎంతో గొప్పదని,సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావంపెంపొందించుకోవాలని సూచించారు.ప్రాంత సేవికా సమితి శారీరక్ ప్రముక్ లెక్కల రమాదేవి, జిట్స్ వేద పాఠశాల ప్రధాన చార్యులు కళకుట్ల వరప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని,హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణమనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. ఆడపిల్లలను లవ్ జిహాద్ భారీ నుండి రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.యువత చెడు మార్గాలను అనుసరించకుండా, సన్మార్గం పైపు పయనించడానికి ఆలోచించాలన్నారు.ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలని,ధార్మిక,ఆధ్యాత్మిక మార్గాల వైపు మనసును మళ్లించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు.ధర్మాన్ని రక్షించినప్పుడే ఆ ధర్మం కూడా మనల్ని రక్షిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి హిందూసమ్మేళనం కమిటీ బాధ్యులు, ఆర్ఎస్ఎస్ పెద్దలు కిషన్ జి, సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పూల్లూరి రామారావు, తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, తిమ్మాపూర్ ఉప మండల ప్రముఖ్ కన్నం సాయి,తిమ్మాపూర్ ఉప మండలంలోని 8 గ్రామాల హిందూ బంధువులు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్‌కి వినతిపత్రం టి జి వి పి

### తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ మరియు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్ కుమార్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20: నిర్మల్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అండ్ జూనియర్ కాలేజ్ బాలికలు నిర్మల్ సోఫీ నగర్ పాఠశాలలో కాంట్రాక్టు ఉద్యోగ నియామకాలలో విచారణ కోరుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అండ్ జూనియర్ కాలేజ్ బాలికలు నిర్మల్ సోఫీ నగర్ పాఠశాలలో సోషల్ పి జి టి గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి న్ మేరీ మార్గరెట్ తమ భర్త సురేష్ ని కంప్యూటర్ ఆపరేటర్ కాంటాక్ట్ ఉద్యోగిగా నియమించినట్లు తెలిసింది ఈ నియామకం ప్రభుత్వ నిబంధనలు. నియామక విధానాలు. పారదర్శకత ను పాటించకుండా జరిగినట్లు సమాచారం. ఇది ముమ్మాటికి అధికార దుర్వినియోగమే ఇట్టి సదరు విషయమై ప్రిన్సిపాల్ ని సంప్రదించగా దురుసుగా ఏజెన్సీకి వెళ్లి అడగండి అని హాస్యాస్పదంగా మాట్లాడారు. ఈ నియామకంలో సదరు వ్యక్తి అందులో పనిచేయువారి భర్త అని తెలిసి కూడా ప్రిన్సిపాల్ విధుల్లోకి తీసుకోవడం జరిగింది ఇందుకు సహకరించిన ప్రిన్సిపల్ పైన తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని. నియామకం చేపట్టిన ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉన్న ఏజెన్సీని రద్దు చేయాలని. కంప్యూటర్ ఆపరేటర్గా విధులు నిర్వహిస్తున్న శ్రీ సురేష్ ఉమ్మడి జిల్లా కు చెందినవారు కాకపోవడం చాలా పెద్ద తీవ్ర పరిణామంగా పరిగణించగలరు. కావున తమరు తక్షణమే ఆ ఉద్యోగి విధుల నుండి తీసివేసి ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ మహిళలకు కేటాయించాలని. అన్ని జరుగుతున్న చోద్యం చూస్తున్న ప్రిన్సిపల్ ని తక్షణమే సస్పెండ్ చేయాలని. చట్ట విరుద్ధంగా పనిచేస్తున్న ఏజెన్సీని మీ ద్వారా రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విన్నవిస్తున్నాం.

## మొక్కజొన్న, వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20: సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామంలో పి ఏ సి స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మరియు డి ర్ డి ఎ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. మొక్కజొన్న కనీస మద్దతు ధర 2,400/- లు, వడ్ల కనీస మద్దతు ధర 2,389/- గా ఉందని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంట సాగు అధికంగా ఉన్న కారణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మాట్లాడటంతో మంజూరైనట్లు తెలిపారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు అవసరమైన ప్రాంతాల్లో వాటిని ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. రైతులు ఈ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, మధ్య ప్రైవేట్ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, గ్రామ సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, మండల అధ్యక్షులు నరేష్, బీజేపీ నాయకులు భోజన్న, ఈర్ల విజయ్, మండల బీజేపీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రలను సద్వినియోగం చేసుకోవాలి

### – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, ఏప్రిల్ 20(వాయిస్ టుడే ప్రతినిధి): మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ లలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు సూచించారు.. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.2400 మద్దతు ధర కల్పిస్తుందని, మార్కెట్ లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పంటను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు..

బయట నుండి ధాన్యం రాకుండా పటిష్ట భద్రత

ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా బార్డర్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, సివిల్ సప్లయ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పని చేస్తూ బయట నుండి ధాన్యం రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి అందిస్తున్న బోనస్ తెలంగాణ రైతులు పొందేలా బయట నుండి ధాన్యం రాకుండా ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం వస్తున్నట్లు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు..జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.. జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు..

### రైతులకు రూ.5లకే నాణ్యమైన భోజనం

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో రైతుల కోసం ఏర్పాటు చేసిన రూ.5ల భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.. హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5 అన్నపూర్ణ భోజనాన్ని కలెక్టర్ ప్రారంభించి రైతులకు స్వయంగా వడ్డించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దూరం నుండి పంటను అమ్ముమునేందుకు వస్తున్న రైతులకు మంచి క్వాలిటీ భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. అన్నం, కూర, పప్పు, పచ్చడితో రైతులకు నాణ్యత భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని, సీజన్ సమయంలో భోజనం తో పాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, డి.ఎ.ఓ. శ్రీధర్ రెడ్డి, డి.ఎం.ఓ. నాగేశ్వర శర్మ, డి.సి.ఓ. ప్రవీణ్, ఎ.ఎం.సి.డైరెక్టర్స్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడలో సినీనటి పూనమ్ కౌర్ ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే); రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయ మైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని సినీనటి పూనమ్ కౌర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె స్వామి వారి కి కోడె మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ మండపం లో అర్చకులు, వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం అంద జేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.



## పిట్లంలో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం

పిట్లం, ఏప్రిల్ 20 వాయిస్ టుడే ప్రతినిధి : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని 7వ కేంద్రంలో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకురాలు షెహనాజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పలువురు సూచించారు.



## అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నియోజకవర్గానికి చెందిన అంగన్వాడి టీచర్లకు మొబైల్ స్మార్ట్ ఫోన్లను అందజేశారు. ఈ మొబైల్ ఫోన్ ల ద్వారా పోషణ మరియు ఆరోగ్యపరమైన వివరాలను నమోదు చేయడం సులభతరం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,మేడిసెమ్మ రాజు, పట్టణ కౌన్సిలర్ గంజి విజయ్ కుమార్ (రాజు) బీజేపీ నాయకులు రాచకొండ సాగర్, అంగన్వాడీ టీచర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సాగర్ సందర్శించిన ఏ ఎస్ ఓల బృందం

నాగార్జునసాగర్ ఏప్రిల్ 20 (వాయిస్ టుడే) : అంతర్జాతీయ పర్యాట కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం నాడు కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం సోమవారం సందర్శించారు. కేంద్ర సర్వీస్ లో నియమితులైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం కోఆర్డినేటర్ కవిత ఆధ్వర్యంలో భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతూ శిక్షణలో భాగంగా నాగార్జునసాగర్ ని సందర్శించారు. ఈ సందర్భంగా టూరిజం లాంచిలో నాగర్జున కొండా మ్యూజియాన్ని, నాగార్జునసాగర్ డ్యామ్ ను సందర్శించారు. అనంతరం బుద్ధవనం లోని బుద్ధ చరిత వనం, ధ్యానవనం స్తూప వనాలను సందర్శించి బుద్ధవనం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం మహాస్థూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర వీరిచే ధ్యానం చేయించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్, నాగార్జునకొండ మ్యూజియం, బుద్ధవనం చారిత్రక విశేషాలను తెలియజేశారు. వీరితోపాటు ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వాయిస్
హైదరాబాద్
మంగళవారం 21 ఏప్రిల్ 2026



## జాఫ్రాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రేష్ట ఐర అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20 : సొన్ మండలం జాఫ్రాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రేష్ఠ ఉ ఐర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్ ను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బర్ల మానస హరీష్ రెడ్డి, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి , గ్రామ సర్పంచ్ బర్ల రాజు రెడ్డి, తో పాటు మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నిర్మల్ జిల్లా డాక్టర్ సెల్ చైర్మెన్‌గా జయశ్రీ నియామకం

ఖానాపూర్, ఏప్రిల్ 20(వాయిస్ టుడే) నిర్మల్ జిల్లా డాక్టర్ సెల్ చైర్మెన్ గా డాక్టర్ జయశ్రీ ని నియమించిన నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియామక పత్రం అందించి శుభాకాంక్షలు తెలిపిన డిసిసి అధ్యక్షులు, వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు జిల్లా లోని అన్ని అనుబంధ విభాగాలను పార్టీకి విధేయులుగా పనిచేసే వారికి బాధ్యతలు ఇస్తున్నాం , నాయకులు నమ్మకంతో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ , ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాలను ప్రజలందరికీ తెలిజేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, లింగ వివక్షతను, మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ, సమసమాజ స్థాపన కోసం వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు బీజేపీ నాయకులు వీరేష్ సాగర్, ఆనంద్ తో పాటు గ్రామాల సర్పంచ్ లు, బీజేపీ పట్టణ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా పదోన్నతి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20: నిర్మల్ జిల్లా బైంసా ఏఎస్పీగా పనిచేసి పదోన్నతి పై వనపర్తి జిల్లా అదనపు ఎస్పీగా బదిలీ అవుతున్న రాజేష్ మీనాకు నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల సోమవారం పూలమాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పదోన్నతి చిహ్నాలను అందజేసి అభినందించారు. నిర్మల్ బైంసా పట్నంలో రాజేష్ మీనా ఏఎస్పీగా విశిష్ట సేవలు అందించారని అదే నిబంధనలతో తమ విధులను నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి ఎస్ఐలు, సిఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బసవేశ్వరుడు చూపిన మార్గంలోనే నడవాలి

### రాజా ప్యాలెస్ అధినేత రాజ్ పటేల్



ఝరాసంగం, ఏప్రిల్ 20 (వాయిస్ టుడే) : జహీరాబాద్ పట్టణంలో మహాత్మా జగద్గురు శ్రీ బసవేశ్వరుడు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులు హాజరై బసవేశ్వర స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు బసవ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన అతిథులు, కులరహిత మరియు సమానత్వ సమాజ స్థాపన కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప సంస్కర్త బసవేశ్వరుడని పేర్కొన్నారు. “కాయక? కైలాసం” అనే సూత్రంతో పనే దైవమని నమ్మిన ఆయన బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకమని అన్నారు. అలాగే, “పనిని మించిన దైవం లేదు, కష్టాన్ని మించిన భక్తి లేదు. చేతి పనిలోనే దేవున్ని చూపించి ‘కాయకమే కైలాసం’ అనే మహోన్నత భావజాలాన్ని ప్రపంచానికి అందించిన మహాత్ముడు బసవేశ్వరుడు. ధర్మం పేరిట జరుగుతున్న అన్యాయాలను ఖండించి సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు” అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజా ప్యాలెస్ అధినేత రాజ్ పటేల్‌తో పాటు కె. శోభారాణి, మాల్ శెట్టి పటేల్, ఇందూర్ సావిత, రేణుక బస్వరాజ్, సుజాత మారుతీ, సునీత రమేష్, లక్ష్మి వీరేశం, శివశరణప్ప, అరుణ, సంతోష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ఘన విజయం

మక్తల్ ఏప్రిల్ 20 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పురపాలిక లోని 6వ వార్డు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎరుకలి సత్యమ్మ అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి ఎరుకలి మారెప్ప పై 37ఓట్ల మెజారిటీ తో ఘన విజయం సాధించారు. ఇటీవల ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపల్ ఎన్నికలకు ఒకరోజు ముందు బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తో ఉప ఎన్నిక అనివార్యమయ్యింది.ఈ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా మృతుడు ఎరుకలి మహాదేవప్ప సతీమణి ఎరుకలి సత్యమ్మ పోటీ చేయగా అధికార కాంగ్రెస్ అభ్యర్థిగా మారెప్ప ,బిఆర్ఎస్ అభ్యర్థిగా మొగులప్ప తలపడ్డారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి నిర్మల్ కలెక్టర్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 20: నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకూడదని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె స్వయంగా ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజలు ఎన్నో ఆశలతో వస్తారని వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ విడతలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు భూ సమస్యలు పింఛన్ల కోసం దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాల భవన్‌లో వేసవి శిక్షణా తరగతులు

**విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి శిబిరం**

నాగార్జునసాగర్, ఏప్రిల్ 20: వాయిస్ టుడే : తెలంగాణ ప్రభుత్వం విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల భవన్, హిల్ కాలనీ నాగార్జునసాగర్‌లో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 27 నుండి జూన్ 5 వరకు కొనసాగనుంది. బాలలలో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, కళా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో ముఖ్యంగా డ్రాయింగ్ పెయింటింగ్, నృత్యం వంటి అంశాల్లో శిక్షణ అందించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8.00 గంటల నుండి 11.00 గంటల వరకు తరగతులు నిర్వహించబడతాయని అధికారులు వెల్లడించారు. జిల్లా బాలల భవన్, హాల్ కాలనీ, నాగార్జునసాగర్ పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనదలచిన విద్యార్థులు తల్లిదండ్రుల అనుమతితో హాజరుకావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాల కోసం 9490627210, 9440245905 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## మహాత్మ బసవ జయంతి ఉత్సవల్లో పాల్గొన్నా మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్



ఝరాసంగం ఏప్రిల్ 20 (వాయిస్ టుడే): జహీరాబాద్ మండలంలోని హుగ్గేల్లి బైపాస్ వద్ద ఉన్న సామాజిక సంఘ సంస్కర్త,మహనీయుడు శ్రీ.బసవేశ్వర 893 వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం జరిగింది..అనంతరం లిమాజీ మంత్రివర్యులు డా॥చంద్రశేఖర్ లి మాట్లాడుతూ సామాజిక సమానత్వం, సత్యం, న్యాయం వంటి మహోన్నత విలువలను మన జీవన విధానంగా మార్చాలని బోధించిన మహానుభావుడు బసవన్న. కష్టపడి పనిచేయడమే నిజమైన భక్తి అనే ఆయన సందేశం నేటికీ మార్గదర్శకం. కుల, మత భేదాలకు అతీతంగా సమానత్వం, మానవతా విలువలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆ మహనీయుడి ఆశయాలను నిజం చేసుకుందాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మునిసిపల్ ఛైర్మెన్ మహమ్మద్ యూనుస్ , పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు ,కేతకి సంగమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్ , ఏ.యం.సి.డైరెక్టర్ కిషన్ , సర్పంచ్ రాజ్ కుమార్ గారు,కాంగ్రెస్ నాయకులు హుగ్గేల్లి రాములు, నయిమ్ అహ్మద్ , వీర్ శెట్టి గారు, గౌసోద్దీన్ , జనార్దన్ ,చంద్రశేఖర్ , తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఫైర్ స్టేషన్‌లో నేషనల్ ఫైర్ సర్వీస్ వీక్ - 2026 విజయవంతం



ఝరాసంగం ఏప్రిల్ 20 (వాయిస్ టుడే) : జహిరాబాద్ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఫైర్ సర్వీస్ వీక్--2026లో భాగంగా ఈ ఏడాది జహీరాబాద్ ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. విభిన్న కార్యక్రమాల క్రమంలో పట్టణంలోని ప్రజా ప్రదేశాలలో పోస్టర్ విడుదల, ప్రెస్ మీట్స్, ఫైర్ ప్రదర్శనలు మరియు ఫైర్ డ్రిల్స్ నిర్వహించగా, నివాస ప్రాంతాలు, పరిశ్రమలు, ఆసుపత్రులు మరియు విద్యాసంస్థల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థుల్లో అగ్ని భద్రతపై అవగాహన పెంచేందుకు వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలను కూడా నిర్వహించారు. 20 ఏప్రిల్ 2026న నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వారంరోజుల కార్యక్రమాల వివరాలను తెలియజేసే ప్రెస్ మీట్ కూడా జరిగింది. ఈ అన్ని కార్యక్రమాలు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీ పి. గోపాల్ గారి పర్యవేక్షణలో సజావుగా మరియు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అధికారులు “అగ్ని భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత” అని ప్రజలకు సందేశం పంపారు.

## సూర్యాపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్‌గా షేక్ సైదా నియామకం

**జర్నలిస్టుల ఆధ్వర్యంలో సైదాకు ఘన సన్మానం**

హుజూర్ నగర్, ఏప్రిల్,20 (వాయిస్ టుడే ప్రతినిధి) : సూర్యాపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జర్నలిస్ట్ షేక్ సైదా ను సోమవారం జర్నలిస్టులు,టీజేఏ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీజేఏ సూర్యాపేట జిల్లా కోశాధికారి కొత్తపల్లి మధు సూధన్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యూనియన్ తరపున సూర్యాపేటజిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా అవకాశం రావడం గర్వకారణమన్నారు. కమిటీ సభ్యునిగా ఉండేందుకు అతనికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. అర్హులైన జర్నలిస్టుల హక్కుల కోసం యూనియన్ తరపున నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. జర్నలిస్టు యొక్క హక్కులు కాపాడుటకు తన వంతు కృషి చేయాలన్నారు. జర్నలిస్టులకు బస్సు పాసులు పూర్వం మాదిరిగానే కొనసాగేందుకు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులందరూ ప్రయత్నం చేయాలన్నారు టీ.జే.ఏ. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెండు పడకల గదులు లేదా ఇంటి స్థలం రైల్వే పాస్ పునరుద్ధరణ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లోజు నాగేంద్ర చారి, గోరంట్ల శ్రీనివాస్, భయ్యారపు రవీంద్ర, కొండమీది నరసింహారావు,మిద్దె రాకేష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**